


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
21-08-2025
పేజీలు: 02




## ఓటిటిలోకి కొత్తపల్లిలో ఒకప్పుడు

ఇటీవల మన టాలీవుడ్ సినిమా నుంచి రిలీజ్ కి వచ్చిన చిత్రాల్లో "కొత్తపల్లిలో ఒకప్పుడు" చిత్రం కూడా ఒకటి. క్లాసిక్ హిట్ చిత్రం కేరాఫ్ కంచరపాలెం నటి ప్రవీణ పరుచూరి దర్శకత్వం వహించిన ఈ ఇంట్రెస్టింగ్ విలేజ్ హారర్ కామెడి చిత్రం థియేటర్స్ లో డీసెంట్ రెస్పాన్స్ ని అందుకుంది. నూతన నటీనటులు మనోజ్ చంద్ర మోనికా జంటగా నటించిన ఈ చిత్రం నేటి నుంచే ఓటిటిలో స్ట్రీమింగ్ కి వచ్చేసింది. ఈ సినిమా తాలూకా హక్కులు మన తెలుగు స్ట్రీమింగ్ యాప్ ఆహా వారు సొంతం చేసుకోగా అందులో ఆహా గోల్డ్ వినియోగదారులకి ఒకరోజు ముందే అందుబాటులోకి వచ్చేసింది. రేపటి నుంచి మిగతా వినియోగదారులకి సినిమా స్ట్రీమింగ్ కి రానుంది. సో ఈ సినిమా చూడాలి అనుకునేవారు ఆహా లో ట్రై చేయవచ్చు.

# బీసీసీఐ కీలక నిర్ణయం

## చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం పొడిగింపు

భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకున్నది. టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలాన్ని పొడిగించినట్లు సమాచారం. ఆయన పదవీకాలాన్ని 2026 జూన్ వరకు పొడిగించినట్లుగా పలు నివేదికలు తెలిపాయి. అయితే, అగార్కర్ నేతృత్వంలో భారత్ జట్టు వరుసగా 2024 టీ20 ప్రపంచకప్, 2025 చాంపియన్స్ ట్రోఫీ వంటి ప్రతిష్టాత్మక టైటిల్స్‌ను సాధించింది. దాంతో సెలక్షన్ కమిటీపై బీసీసీఐ పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తూ.. అజిత్ అగార్కర్ కాంట్రాక్ట్‌ను పొడిగించినట్లుగా పలు నివేదికలు తెలిపాయి. 'అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ, జట్టులో విజయవంతమైన మార్పులు తీసుకురావడంలో సఫలమైంది. అగార్కర్ తన పదవీకాలంలో భారత జట్టును ఒక్కటి కాదు.. రెండు ప్రతిష్ఠాత్మక టైటిళ్లను గెలిపించడమే కాకుండా, టెస్టులు, టీ20 జట్లలో మార్పులను ప్రవేశపెట్టాడు' అని ఓ బీసీసీఐ అధికారి పేర్కొన్నారు. దాంతో ఈ నిర్ణయం, అగార్కర్ తన కాంట్రాక్ట్ పొడిగింపును కొన్ని నెలల క్రితమే అంగీకరించడంతో మరింత స్పష్టమైంది. ప్రస్తుత సెలక్షన్ ప్యానెల్‌లో ఎస్ఎస్ దాస్, సుబ్రతో బెనర్జీ, అజయ్ రాత్రా, ఎస్ శరత్ సభ్యులుగా ఉన్నారు. సెప్టెంబర్‌లో జరిగే బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో కమిటీలో మార్పులను చేసే అవకాశం ఉందని సమాచారం. శరత్ స్థానాన్ని భర్తీ చేసే అవకాశం ఉందని.. దాస్, బెనర్జీ స్థానాల విషయంలో సమీక్షించనున్నట్లు తెలుస్తున్నది. సమావేశం తర్వాత బోర్డు సెలక్షన్ కమిటీ సభ్యుల




నియామకం కోసం దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలుస్తున్నది. సీనియర్ మహిళా, జూనియర్ పురుషుల సెలక్షన్ కమిటీల్లోనూ మార్పులు చేయనున్నట్లు తెలుస్తున్నది. నీతు డేవిడ్, ఆరతి వైద్య, మిథు ముఖర్జీలతో కూడిన మహిళా ప్యానెల్ ఐదేళ్ల పదవీకాలం పూర్తయ్యింది. బీసీసీఐ నిబంధనల ప్రకారం. ఐదేళ్లు గరిష్ట పదవీకాలం. రాబోయే వారాల్లో కొత్త సభ్యుల కోసం దరఖాస్తులను ఆహ్వానించనున్నది. ఇదిలా ఉండగా.. ఆటగాళ్ల పనిభారం నిర్వహణ విషయంలో, ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా విషయంలో సెలక్షన్ కమిటీ అనుసరిస్తున్న విధానంపై అగార్కర్ మాట్లాడారు. బుమ్రా ఫిట్‌నెస్ గురించి ఆందోళనలను ప్రస్తావిస్తూ.. అధికారిక పనిభారం ప్రణాళిక లేదని, అయితే జట్టు నిర్వహణ, వైద్య సిబ్బంది మధ్య సమన్వయం ఉంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని పేర్కొన్నారు. 'సహజంగానే, ఇంగ్లండ్ సిరీస్ తర్వాత కూడా విరామం దొరికింది. జట్టు నిర్వహణ, ఫిజియోలు, సంబంధిత వ్యక్తులు ఎల్లప్పుడూ సంప్రదింపులు జరుపుతున్నారు. ఇది ఇప్పుడే కాదు. గాయానికి ముందు కూడా అతను (బుమ్రా) ఎంత విలువైనవాడో మాకు తెలుసు కాబట్టి అతన్ని జాగ్రత్తగా చూసుకోవడానికి ప్రయత్నించాం' అని అగార్కర్ అన్నారు. అగార్కర్ పదవీకాలం పొడిగించడం భారత క్రికెట్‌కు కీలకం కానున్నది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్, 2027లో వన్డే ప్రపంచకప్‌కు జట్టును సిద్ధం చేయాల్సి రానున్నది.



## పాసైన ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు.. అన్ని రకాల మనీ గేమ్స్‌పై నిషేధం

ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు.. పార్లమెంట్‌లో పాసైంది. ఇవాళ రాజ్యసభలో ఆ బిల్లుకు ఆమోదం దక్కింది. విపక్షాలు తీవ్ర ఆందోళన చేపడుతున్న నేపథ్యంలోనే బిల్లును పాస్ చేశారు. ఎటువంటి చర్చ లేకుండానే బిల్లుకు పచ్చజెండా ఊపారు. కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్‌లో జరిగే అన్ని రకాల మనీ గేమ్స్‌ను నిషేధిస్తూ ఈ బిల్లును రూపొందించారు. అయితే ఈ బిల్లు ద్వారా ఈస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌ను మాత్రం ప్రమోట్ చేస్తున్నారు. విపక్ష సభ్యులు ఇచ్చిన సవరణలను తోసిపుచ్చుతూ.. ఇవాళ రాజ్యసభలో ఆ బిల్లుకు ఆమోదం దక్కింది. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు బుధవారం లోక్‌సభలో క్లియరెన్స్ దక్కిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ మనీ గేమ్స్, బ్యార్ బ్యాంక్స్, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు చెందిన వాణిజ్య ప్రకటనపై కూడా నిషేధం విధించారు. డబ్బులు డిపాజిట్ చేసి ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడే విషయం తెలిసిందే. గెలిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయన్న ఆశతో ఈ క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతోంది.



## శ్రీశైలంలో కుట్రలు.. రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి వ్యవహారంపై బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులపై దాడి చేసిన రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారని.. ఈ విషయం చాలా మంచిదేనని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులపైన దాడి చేస్తే కఠిన చర్యలు ఉంటాయనే మంచి సందేశాన్ని పవన్ కల్యాణ్ ఇచ్చారని చెప్పుకొచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే రాజాసింగ్ ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని కాపాడే బాధ్యత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పైన కూడా ఉంటుందని సూచించారు. శ్రీశైలం జ్యోతిర్లింగాన్ని దర్శించుకోవడానికి యావత్ భారతదేశం నుంచి భక్తులు చాలామంది వస్తారని.. కానీ దురదృష్టం ఏంటంటే గతంలో రాజకీయ పార్టీల నేతలు కొన్ని పాపాలు అక్కడ చేశారని గుర్తుచేశారు. శ్రీశైలం చాలా పెద్ద పవిత్ర స్థలం, కానీ ఈ పవిత్ర స్థలాన్ని అపవిత్రం చేయడానికి కుట్రలు చాలా కాలంగా జరుగుతున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వాలు తమ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి ముస్లింలను శ్రీశైలం పవిత్ర ప్రాంతంలో స్థిరపరిచాయని షాకింగ్ కామెంట్స్ చేశారు. మునుపటి పార్టీలు తమ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి క్రైస్తవ కుటుంబాలను శ్రీశైలం పవిత్ర ప్రాంతంలో స్థిరపరిచాయని సంచలన వ్యాఖ్యలు చేశారు

## సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన రద్దు.. రాష్ట్ర కార్యక్రమాలపై దృష్టి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన రద్దయినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గురువారం ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డి నామినేషన్ వేయనున్న కార్యక్రమానికి సీఎం హాజరు కావాల్సి ఉండగా, రాష్ట్రంలోని అధికారిక కార్యక్రమాల షెడ్యూల్ కారణంగా ఈ పర్యటన రద్దు చేయబడింది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని తన బాధ్యతలపై దృష్టి సారించనున్నారు.

రాష్ట్రంలో జరగనున్న పలు ముఖ్యమైన కార్యక్రమాలు సీఎం షెడ్యూల్‌ను బిజీగా ఉంచాయి. ముఖ్యంగా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సమావేశాలు మరియు ప్రజలతో సంబంధిత కార్యక్రమాలు రేవంత్ రెడ్డి రాష్ట్రంలోనే ఉండి పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. ఈ కారణంగా, ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకుని, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం స్థానిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఈ రద్దు నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి గురువారం ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)లో పర్యటిస్తారా లేదా అనే విషయం ఇంకా స్పష్టత రాలేదు.



ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఓయూలో పర్యటన ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని ఇతర అత్యవసర కార్యక్రమాల ఆధారంగా ఈ షెడ్యూల్‌లో మార్పులు ఉండవచ్చని సమాచారం. ఈ విషయంపై అధికారిక సమాచారం కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమంపై చూపిస్తున్న శ్రద్ధ ఈ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఢిల్లీ పర్యటన రద్దు నిర్ణయం రాష్ట్రంలోని ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ, స్థానిక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలనే సీఎం ఆలోచనను ప్రతిబింబిస్తుంది. రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి షెడ్యూల్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.




## వన్డే కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్?

వచ్చే నెలలో జరగనున్న ఆసియాకప్‌కు.. శ్రేయాస్ అయ్యర్(Shreyas Iyer)ను బీసీసీఐ పక్కన పెట్టిన విషయం తెలిసిందే. టాప్ ఫామ్‌లో ఉన్న అయ్యర్‌ను ఎందుకు ఆ టోర్నీ కోసం ఎంపిక చేయలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ వర్గాలు ఓ కీలక అప్‌డేట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఓ ప్రధాన ఆంగ్ల మీడియాలో వచ్చిన కథనం ప్రకారం.. భవిష్యత్తులో శ్రేయాస్ అయ్యర్‌ను వన్డే కెప్టెన్‌గా ప్రకటించే ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్లు తెలుస్తోంది. రోహిత్ శర్మకు లాంగ్ టర్మ్ ఆప్షన్‌గా అయ్యర్‌కు బాధ్యతలు అప్పగించాలని బీసీసీఐ యోచిస్తున్నట్లు ఓ కథనం పేర్కొన్నది. రోహిత్ శర్మ టీ20లు, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి జరగనున్న ఆసియాకప్‌కు భారత జట్టు కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్‌గా గిల్ నియమితులయ్యారు. అయితే ఆ టోర్నీ కోసం శ్రేయాస్ అయ్యర్‌ను ఎంపిక చేయలేదు. ఈ వివాదం నేపథ్యంలో బీసీసీఐ ప్రణాళిక ఒకటి బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. ఆసియా కప్ తర్వాత అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో ఇండియా వన్డే సిరీస్ ఆడనున్నది. అయితే ఆసియాకప్ టోర్నీ ముగిసిన తర్వాత ఆసీస్‌తో జరిగే వన్డేలకు జట్టును బీసీసీఐ ప్రకటిస్తుంది. ఆ సిరీస్‌కు అయ్యర్‌ను ఎంపిక చేస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.


## తిరుమల సన్నిధిలో చై, శోభిత!

అక్కినేని నాగ చైతన్య హీరోగా ఇప్పుడు తన కెరీర్ 24వ సినిమా దర్శకుడు కార్తీక్ వర్మ దండుతో చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం షూటింగ్ కి చిన్న గ్యాప్ ఇచ్చిన చైతూ తన బెస్ట్ హాఫ్ తో కలిసి కొంచెం సమయాన్ని డివోషనల్ గా గడుపుతున్న మూమెంట్స్ ఫ్యాన్స్ లో వైరల్ గా మారాయి. ఇక ఇదిలా ఉండగా చైతు మరియు తన భార్య శోభిత ధూళిపాళ తిరుమల సన్నిధిలో కనిపించి అభిమానులకి ఆనందం కలిగించారు. మరి అక్కడే తమపై ఓ బ్యూటిఫుల్ స్నాప్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. శ్రీవారి ప్రతిమని పట్టుకొని ఇద్దరి జంట ఎంతో చక్కగా కనిపిస్తున్నారు. ఇలా వీరి పిక్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇక నాగ చైతన్య చిత్రాన్ని సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర వారు భారీ బడ్జెట్ తో ఓ ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ లా ప్లాన్ చేస్తున్నారు.



## బికినీలో షాలిని పాండే

ఒక్క హాట్ ఒకే ఒక్క హిట్ పడితే చాలు హీరోయిన్స్ దశ తిరిగిపోతుంది. ఇప్పుడున్న ముద్దుగుమ్మలు ఓవర్ నైట్ లో స్టార్స్ గా మారిపోతున్నారు. ఒకే ఒక్క సినిమాతో హిట్ అందుకొని క్రేజీ ఆఫర్స్ అందుకుంటున్నారు. ఒక్క సినిమా క్లిక్ అయితే చాలు వరుసగా అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతున్నారు. కొంతమంది కంటిన్యూ అవుతున్నారు. మరికొంతమంది మాత్రం ఫ్లాప్స్ పలకరించడంతో కనుమరుగవుతున్నారు. అలాంటి వారిలో ఈ చిన్నది ఒకరు. ఈ ముద్దుగుమ్మ ఏకంగా 12 సినిమాల్లో నటించింది. కానీ ఒకే ఒక్క సినిమా బ్లాక్ బస్టర్ అయ్యింది. అది కూడా ఈ అమ్మడి తొలి సినిమా.. మొదటి సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయినా కూడా ఈ చిన్నదానికి అనుకున్నంతగా ఆఫర్స్ రాలేదు.ఈ అమ్మడు నటించిన సినిమాల్లో 118 సినిమా ఆ ఒక్కటి కాస్త పర్లేదు అనిపించుకుంది. మిగిలిన సినిమాలన్నీ ప్రేక్షకులను నిరాశపరిచాయి. ఇక సోషల్ మీడియాలో ఈ చిన్నది చేసే హడావిడి అంతా ఇంతా కాదు. తన అందాలతో కుర్రాళ్లకు గాలాలు వేస్తుంది. అందాలు ఆరబోస్తూ ఫోటోలకు ఫోజులిస్తుంది. అందం , అభినయం ఉన్న ఈ అమ్మడిని అవకాశాలు మాత్రం వరించడం లేదు. ఇక నెట్టింట ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోలకు భారీ డిమాండ్ ఉంటుంది. నెటిజన్స్ ఈ బ్యూటీ ఫోటోల పై క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.



EVENING EDITION
గురువారం | 21 ఆగస్ట్ 2025
www.suryaa.com 4PM
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## మియాపూర్‌లో విషాదం..
### ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి

హైదరాబాద్‌లోని మియాపూర్‌లో విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. వీరంతా ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొంటున్నారు. ఈ ఘటన మియాపూర్‌లోని మక్తా మహబూబ్‌పేటలో జరిగింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుల వివరాలు సేకరించారు. మృతులు నర్సింహ (60), వెంకటమ్మ (55), అనిల్ (32), కవిత (24), అప్పు (2)గా పోలీసులు నిర్ధారించారు. కర్ణాటక గుల్బర్గాకు చెందిన నర్సింహ కుటుంబం గత కొంత కాలం నుంచి హైదరాబాద్ లో నివసిస్తోంది.. నర్సింహకు ముగ్గురు కూతుర్లు.. కాగా.. నర్సింహా, అతని భార్య వెంకటమ్మ, రెండవ కూతురు, అల్లుడు, పాపతో మక్తా మహబూబ్‌పేటలో నివిసిస్తున్నాడు.. నర్సింహతోపాటు కుటుంబం మొత్తం కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలోనే వీరంతా బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటనలో రెండవ కూతురు, అల్లుడు పాపతో సహా నర్సింహా.. అతని భార్య వెంకటమ్మ మృతి చెందారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరి ఆత్మహత్యకు ఆర్థిక సమస్యలు కారణమా..? లేదా మరేదైనా కారణాలు ఉన్నాయా..? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.



## తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై
# స్పీకర్ నోటీసుల జారీకి సిద్ధం

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు విషయంలో కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు ఆధారంగా, ఈ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేయాలని స్పీకర్ నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయంలో న్యాయ సలహా తీసుకున్న స్పీకర్, ఫిరాయింపు చట్టం ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గత నెల 25న సుప్రీంకోర్టు ఈ విషయంపై విచారణ జరిపి తీర్పును వెలువరించింది. ఈ తీర్పు ఫిరాయింపు చట్టం అమలుకు సంబంధించి స్పీకర్‌కు స్పష్టమైన మార్గదర్శకాలను అందించినట్లు తెలుస్తోంది. దీంతో, స్పీకర్ ఈ 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ ఫిరాయింపు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీలకు మారిన ఈ ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ తీసుకునే నిర్ణయం రాష్ట్ర రాజకీయ సమీకరణలను మార్చే అవకాశం ఉంది. సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా స్పీకర్ తీసుకునే చర్యలు ఫిరాయింపు చట్టం అమలులో కీలక పాత్ర పోషిస్తాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. నోటీసుల జారీ తర్వాత ఎమ్మెల్యేల నుంచి వివరణలు కోరి, విచారణ జరిపే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే అనర్హతపై తుది నిర్ణయం తీసుకో నున్నారు. ఈ నేపథ్యంలో, ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు రాజకీయంగా గట్టి పరీక్షను ఎదుర్కొంటోందని చెప్పవచ్చు.



## మిస్టర్ బీస్ట్ మరోసారి రికార్డుల రారాజు..
## లైవ్‌స్ట్రీమ్‌తో వంద కోట్ల సేకరణ

అమెరికన్ యూట్యూబర్ మిస్టర్ బీస్ట్, జేమ్స్ జిమ్మీ డోనల్డ్‌సన్‌గా సుపరిచితుడు, తన అద్భుతమైన సాహసాలు మరియు దాతృత్వ కార్యక్రమాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాడు. తాజాగా, 15 గంటల 40 నిమిషాల పాటు నిర్వహించిన మారథాన్ లైవ్‌స్ట్రీమ్‌తో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాడు. ఈ స్ట్రీమ్ ద్వారా అతను వంద కోట్ల రూపాయల నిధులను సేకరించి, సురక్షిత తాగునీటి కోసం పనిచేసే 'టీమ్ వాటర్' స్వచ్ఛంద సంస్థకు అందించాడు. "ఈ స్ట్రీమ్ ద్వారా ఎంతోమంది జీవితాలు మారుతాయి," అని ఆనందం వ్యక్తం చేశాడు మిస్టర్ బీస్ట్. 422 మిలియన్ల సబ్‌స్క్రైబర్లతో యూట్యూబ్‌లో అగ్రగామిగా నిలిచిన మిస్టర్ బీస్ట్, స్టంట్స్ మరియు ఛాలెంజ్‌లతో ప్రేక్షకులను అలరిస్తాడు. 'ఫోర్బ్స్' మ్యాగజైన్ ఈ సోషల్ మీడియా మెగాస్టార్‌ను 'రింగ్‌మాస్టర్ ఆఫ్ స్టంట్స్ అండ్ ఛాలెంజెస్'గా అభివర్ణించింది. అతని ఆదాయ మార్గాల్లో యూట్యూబ్ స్ట్రీమింగ్‌తో పాటు ఫాస్ట్‌ఫుడ్ చైన్‌లు కూడా ఉన్నాయి, ఇవి అతన్ని ఫోర్బ్స్ జాబితాలో సంపన్నుడిగా నిలిపాయి. మిస్టర్ బీస్ట్ తన ప్రత్యేకతను సోషల్ మీడియా వేదికలపై కూడా నిరూపించాడు. 'థ్రెడ్'లో ఒక మిలియన్ ఫాలోవర్లను సాధించిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించాడు. అతని లైవ్‌స్ట్రీమ్‌లు కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా, సామాజిక సేవ కోసం కూడా ఉపయోగపడుతున్నాయి. ఈ లైవ్‌స్ట్రీమ్ విజయం అతని దాతృత్వానికి మరో ఉదాహరణగా నిలిచింది. తన సాహసకృత్యాలు మరియు సేవా కార్యక్రమాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించిన మిస్టర్ బీస్ట్, ఈ లైవ్‌స్ట్రీమ్‌తో మరోసారి తన సత్తా చాటాడు. సురక్షిత తాగునీటి కోసం నిధుల సేకరణతో పాటు, అతను సామాజిక మాధ్యమాల్లో సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నాడు.



## బీహార్, బెంగాల్‌లో శుక్రవారం
## ప్రధాని మోదీ పర్యటన..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ.. వేలాది కోట్ల బహుళ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించనున్నారు. ప్రధానమంత్రి మోదీ బీహార్ లో NH-31లో 8.15 కి.మీ పొడవైన ఆంట — సిమారియా వంతెన ప్రాజెక్టును అలాగే.. కోల్‌కతాలో మెట్రో రైల్వే ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టులు బీహార్, కోల్‌కతాలో కీలకంగా మారనున్నాయి.. బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో దాదాపు 18 వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులను మోదీ ప్రారంభించనున్నారు. బీహార్ లో NH-31లో 8.15 కి.మీ పొడవైన ఆంట — సిమారియా వంతెన ప్రాజెక్టును ప్రధాని మోదీ ప్రారంభిస్తారు.. ఇందులో గంగా నదిపై రూ. 1,870 కోట్లకు పైగా ఖర్చుతో నిర్మించిన 1.86 కి.మీ పొడవైన 6 లేన్ల వంతెన కూడా ఉంది. ఇది పాట్నాలోని మోకామా — బెగుసరాయ్ మధ్య ప్రత్యక్ష అనుసంధానాన్ని అందిస్తుంది. ఈ వంతెన పాత 2 లేన్ల శిథిలావస్థలో ఉన్న రైలు-కమ్-రోడ్డు వంతెన "రాజేంద్ర సేతు"కి సమాంతరంగా నిర్మించబడింది.. ఇది పేలవమైన శిథిలావస్థలో ఉండటం.. భారీ వాహనాలు తిరిగి వెళ్లాల్సి వస్తుండటంతో ప్రయాణికుల సౌలభ్యం కోసం కొత్త వంతెనను నిర్మించారు. కొత్త వంతెన ఉత్తర బీహార్ (బెగుసరాయ్, సుపాల్, మధుబని, పూర్నియా, అరారియా మొదలైనవి), దక్షిణ బీహార్ ప్రాంతాల (షేఖ్‌పురా, నవాడ, లఖిసరాయ్ మొదలైనవి) మధ్య ప్రయాణించే భారీ వాహనాలకు 100 కి.మీ కంటే ఎక్కువ అదనపు ప్రయాణ దూరాన్ని తగ్గిస్తుంది. ఈ వాహనాలు తీసుకోవలసిన మలుపు కారణంగా ఈ ప్రాంతంలోని ఇతర ప్రాంతాలలో ట్రాఫిక్ జామ్‌ల సమస్యలను తగ్గించడంలో కూడా ఇది సహాయపడుతుంది. ఇది పొరుగు ప్రాంతాలలో, ముఖ్యంగా ఉత్తర బీహార్‌లో ఆర్థిక వృద్ధిని పెంచుతుంది.. ఎందుకంటే ఇవి అవసరమైన ముడి పదార్థాలను పొందడానికి దక్షిణ బీహార్ — జార్ఖండ్‌లపై ఆధారపడి ఉంటాయి.

# డేజ్లింగ్ కావ్య

20 ఆగస్టు 1995న మహారాష్ట్ర రాష్ట్ర రాజదాని ముంబై మహానగరంలో పుట్టి పెరిగింది వయ్యారి భామ కావ్య థాపర్. ఈమె తండ్రి విక్కీ థాపర్ ఓ వ్యాపారవేత్త. తల్లి ఆర్తి థాపర్ గృహిణి. ఈమెకి అభిమన్యు థాపర్ అనే ఓ సోదరుడు కూడా ఉన్నాడు. మహారాష్ట్రలోని ముంబైలో ఉన్న పోవైలో బాంబే స్కాటిష్ స్కూల్ లో పాఠశాల విద్యను పూర్తి చేసింది ఈ అందాల తార. ముంబైలోని ఠాకూర్ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ కామర్స్ నుంచి అండర్ గ్రాడ్యుయేట్ పట్టా పొందింది ఈ అందాల భామ.సినిమాలకి ముందు పతంజలి, మేక్‌మైట్రిప్, కోహినూర్ వంటి అనేక వాణిజ్య ప్రకటనలలో నటించింది ఈ వయ్యారి భామ. 2018లో ఈ మాయ పేరేమిటో అనే తెలుగు రొమాంటిక్ చిత్రంలో కాదహానాయకిగా చలనచిత్ర అరంగేట్రం చేసింది ఈ ముద్దుగుమ్మ. 2021లో సంతోష్ శోభన్ సరసన ఏక్ మినీ కథ అనే తెలుగు అడల్ట్ కామెడీ చిత్రంలో హీరోయిన్ గా ఆకట్టుకుంది ఈ భామ. గత ఏడాది ఈమె నటించిన ఈగల్, ఊరు పేరు భైరవకోన, డబల్ ఇస్మార్ట్, విశ్వం సినిమాల్లో కథానాయికగా కనిపించింది.



## మధురైలో టీవీకే రెండో రాష్ట్ర సమావేశం.. విజయ్ రాజకీయ రణం సిద్ధం



తమిళ సినీ హీరో విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ రెండో రాష్ట్ర సమావేశానికి సర్వం సిద్ధమైంది. మధురైలో నిర్వహించే ఈ భారీ బహిరంగ సభకు దాదాపు 4 లక్షల మంది అనుచరులు, సమర్థకులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మధురై-తూత్తుకుడి రహదారి వెంబడి విశాలమైన స్థలంలో ఈ సభ జరగనుంది. విజయ్ రాజకీయ ప్రవేశంతో తమిళనాడు రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టించేందుకు ఈ సమావేశం కీలకమని భావిస్తున్నారు. ఈ సభలో విజయ్ టీవీకే యొక్క భవిష్యత్తు వ్యూహాలను, ముఖ్యంగా 2026లో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ప్రణాళికలను వెల్లడించే అవకాశం ఉంది. రాజకీయ పొత్తులపై కూడా ఆయన కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నాయి. టీవీకే యొక్క ఈ సమావేశం రాష్ట్ర రాజకీయాల్లో ఒక కొత్త శక్తిగా ఉద్భవించేందుకు దోహదపడనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
సమావేశం కోసం భారీ ఏర్పాట్లు జరిగాయి. విజయ్ అభిమానులు, టీవీకే కార్యకర్తలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మధురైకి తరలివస్తున్నారు. సభా స్థలంలో భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, అవసరమైన సౌకర్యాలను అధికారులు సమన్వయంతో కూడిన రీతిలో సిద్ధం చేశారు. ఈ సమావేశం విజయ్ యొక్క రాజకీయ ప్రభావాన్ని మరింత బలోపేతం చేయడమే కాక, యువతను ఆకర్షించే కొత్త రాజకీయ శక్తిగా టీవీకేను నిలబెట్టే అవకాశం ఉంది.
2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ఈ సభ తమిళనాడు రాజకీయ ల్యాండ్‌స్కేప్‌లో ఒక మైలురాయిగా నిలుస్తుందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. విజయ్ యొక్క సినీ ఖ్యాతి, యువతలో ఆయనకున్న ఆదరణ రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపనుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ సమావేశం టీవీకే యొక్క రాజకీయ లక్ష్యాలను, విధానాలను స్పష్టం చేసే వేదికగా మారనుంది, ఇది రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని అంచనా.